క్లుప్తంగా

జీవనజ్యోతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శోభన్‌బాబు సేవా సంఘ సభ్యులు

గోపాలపట్నం: శోభన్ బాబు, వాణిశ్రీ జంటగా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన జీవన జ్యోతి సినిమాకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శోభన్ బాబు సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పద్మనాభనగర్‌లో సంబరాలు నిర్వహించారు. శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ 1975లోనే హిట్‌గా నిచిందన్నారు. తెలుగు ప్రజలు మర్చిపోలేని సినిమా అని కొనియారు. సినిమాకు 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా జీవన జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంపర అప్పారావు, కంచిపాటి నగరాజు, కంపర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



ర్యాలీలో పాల్గొన్న మలేరియా విభాగ అధికారి రవికుమార్

మల్కాపురం: పరిశుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని మలేరియా విభాగ అధికారి రవికుమార్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మల్కాపురం మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణకు భారత ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని వివరించారు. చుట్టు పక్కల పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని,దోమలు వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మలేరియా విభాగ సిబ్బంది జీవీఎంసీ 40,58,59,60,61,62,63వ వార్డుల పరిధిలో ఇంటింటికి వెళ్లి డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్,రమేష్,నవరత్నం,జిల్లా మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని,డి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరవు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ్‌రెడ్డి

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరువైంది. సోమవారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శల నేపథ్యంలో ఓపెన్ ఫోరమ్‌కు కూడా ఎవరూ పెద్దగా రాలేదు. కేవలం 4 వినతులు మాత్రం వచ్చాయి. ఈ వినతులను జీవీఎంసీ సిటీ ప్లానర్ కె.ధనుంజయ్‌రెడ్డి స్వీకరించారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత



బాలగణేష్‌రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన వ్యక్తిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా.. అల్లిపురం కుమ్మర వీధికి చెందిన చాట్ల బాలగణేష్‌రెడ్డి ఈ నెల 12న కుటుంబంలో కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు అతడి తండ్రి చాట్ల వెంకటరమణ, సోదరుడు చాట్ల సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరెడ్డి సాంకేతికను ఉపయోగించి గాజువాక పరిసర ప్రాంతాల్లో గణేష్‌రెడ్డి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం అతడిని టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సమక్షంలో తండ్రి, సోదరుడికి అప్పగించారు.



ఓ ఇంటి నుంచి కరెంట్ తీసి పనులు చేపడుతున్న సిబ్బంది



మెయిన్ లైన్ నుంచి ఇంటికి కనెక్షన్ కలుపుతున్న సిబ్బంది

కరెంట్ ఇస్తేనే కుళాయి!

- వినియోగదారుల ఇళ్ల నుంచి విద్యుత్‌తో తవ్వకాలు
- కరెంటు ఇవ్వకపోతే కుళాయి కనెక్షన్ రాదని బెదిరింపు
- ప్రశ్నిస్తే జనరేటర్ మరమ్మతులకు గురైందని బుకాయింపు



విసియోగదారుల ఇంటి కరెంట్‌తో గొయ్యి తవ్వుతున్న దృశ్యం



గోపాలపట్నంలో ఒక ఇంటి నుంచి విద్యుత్ తీశారు ఇలా..

గోపాలపట్నం: నగరంలో నిరంతర మంచినీటి సరఫరా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల బలహీనతను కూడా సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కుళాయి కనెక్షన్ రాదని బెదిరిస్తున్నారు. మీరే బాధ్యత తీసుకోవాలి కదా..! ఇళ్ల కరెంట్ ఎలా వినియోగిస్తారని నిలదీస్తే జనరేటర్ మరమ్మతులకు గురైంది.. పనులు తొందరగా కావాలంటే మీరు సహకరించాలి అని బుకాయిస్తున్నారు.

ఒక్కో దగ్గర ఒక్కోలా..

వీధుల్లో గొయ్యిలు తవ్వేందుకు సొంతంగా జనరేటర్లు ఉపయోగించాలి. అలా చేయకుండా వినియోగదారుల ఇళ్ల నుంచి కరెంట్ తీసుకుని పనులు చేపట్టడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్ట్ తీసుకున్నప్పుడే జనరేటర్లతో ఈ పనులు చేయాలని ఒప్పందం చేసుకున్నారు. అయితే జనరేటర్ ఖర్చు మిగుల్చుకునేందుకు ఈ దందా చేస్తున్నారు. ఇందు కోసం పని వారిని ఉసిగొల్పుతున్నారని ప్రజలు వాపోతున్నారు. 5 నిముషాల పనికి కరెంటు ఇస్తే ఏమైపోద్దమ్మా అంటూ ప్రేరేపిస్తారు. మీరు కరెంట్ ఇవ్వకపోతే మా కాళ్ల వద్దకు వస్తారని భయపెడుతుండడంతో వ్యతిరేకించే వారు సైతం పిలిచి విద్యుత్ ఇవ్వాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. ఈ పరిస్థితి ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు నెలకొంది.

ఇదీ పరిస్థితి

వీధుల్లో మెయిన్ లైన్ నుంచి వ్యక్తిగత కనెక్షన్ కలుపుతారు. ఇందుకు మెయిన్ లైన్ పైప్ వద్ద తవ్వకాలు జరుపుతారు. అ తర్వాత వ్యక్తిగత కనెక్షన్‌కు పైప్ అనుసంధానం చేస్తారు. రోడ్డు క్రాస్ చేయాల్సి వస్తే మళ్లీ తవ్వుతారు. మొత్తంగా మూడు మార్లు వినియోగదారులు విద్యుత్ ఇవ్వాల్సి వస్తుంది. డ్రిల్లింగ్ మిషన్‌కు ఎక్కువ యూనిట్లు కాలుతుందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో వీరు విచ్చల విడిగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

లక్షల్లో మిగులు...

వినియోగదారుల కరెంట్ ద్వారా వ్యక్తిగత కుళాయిల కనెక్షన్లు ఇవ్వడం వల్ల కాంట్రాక్టర్‌కు లక్షల్లో మిగులుతుందని నిపుణులు చెబుతున్నారు. జనరేటర్ వాడితే డీజిల్, ఆపరేటర్ మెయింటెనెన్స్ వంటివి పలు రకాల ఖర్చులు లక్షల్లో ఉంటాయని చెబుతున్నారు. అందుకే ఇలా పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే...

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. నగరంలో చాలా చోట్ల ఈ విధంగానే పనులు చేస్తున్నారన్న ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరపాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రామలక్ష్మి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి కె.వి.రామలక్ష్మి తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు పట్టిక పరిశీలించారు. మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందుతుందో లేదా అన్న దానిపై ఆరా తీశారు. కిశోర బాలికలకు రక్తహీనత బారిన పడకుండ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

లారీ డ్రైవర్‌పై రాడ్‌తో దాడి

మల్కాపురం: లారీ డ్రైవర్ పై మరో లారీ డ్రైవర్ ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రంజన్ కొల్లాన్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇదే ట్రాన్స్‌పోర్టులో అదే రాష్ట్రానికి చెందిన ప్రమోద్ కూడా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇది ఇలా ఉంటే ఓ నేవల్ అధికారికి విశాఖపట్నం బదిలీ కావడంతో ఆ అధికారి తన గృహోపకరణాలను ముంబయ్ నుంచి విశాఖ యారాడ కొండపై నేవల్ క్వార్టర్స్‌కు సామగ్రి తరలించాలని ట్రాన్స్‌పోర్టు సంస్థకు తెలిపారు. దీంతో ఈనెల 13న రెండు మినీ లారీలతో నేవల్ అధికారి గృహసామగ్రితో రంజన్, ప్రమోద్ యారాడ కొండపై ఉన్న నేవల్ క్వార్టర్స్‌కు ఈ నెల 15న వచ్చారు. అయితే అప్పటికే సామగ్రి తరలించాలని చెప్పిన నేవల్ అధికారి క్వార్టర్స్ వద్దకు రాకపోవడంతో వారు ఇరువురు లారీలను క్వార్టర్స్ సమీపాన పార్కు చేసి కాలక్షేపం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ మద్యం సేవిస్తుండగా చిన్న వివాదం తలెత్తింది. ఆ వివాదం పెద్దది కావడంతో సహనం కోల్పోయిన ప్రమోద్ ఇనుప రాడ్‌తో రంజన్ తలపై దాడి చేయడంతో తీవ్ర గాయం అయింది. వెంటనే అతన్ని మల్కాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమోద్‌ను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

బిక్కు బిక్కు .. ఎవరు దిక్కు!

- కొత్త గోడ నిర్మాణం జరిగేనా



ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

మల్కాపురం: ఆ కొండ ప్రాంత ప్రజలు నిత్యం బిక్కుబిక్కు మంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి వచ్చేది. ఇంటి తలుపు తెరిస్తే చాలు లోతైన ప్రదేశం కనిపిస్తుండడంతో ఎప్పుడు ప్రమాదానికి గురవుతామో అన్న భయంతో జీవనం సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో సుమారు 400 మంది వరకు జీవనం సాగిస్తున్నారు. వీరంతా వలస కూలీలు.భారీ అద్దెలు చెల్లించుకోలేక కొండ ప్రాంతంలోనే రేకుల షెడ్లు వేసుకుని కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తుంటారు. అయితే గతేడాది కురిసిన వర్షాలకు కొంతమేర రక్షణ గోడ దెబ్బతింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉన్న రక్షణగోడ కూలిపోయింది. కూలిన రక్షణగోడకు ఆనుకుని రేకుల షెడ్ ఇంటి ముందు భాగం ఉంది. దీంతో వారు తలుపు తెరిస్తే చాలు సుమారు 30 అడుగుల లోతు గల ప్రదేశం కనిపిస్తుంది.దీంతో వారు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఎగువ ప్రాంత వాసులు కూడా కూలిన రక్షణ గోడ ఇంటి ముందు నుండే రాకపోకలు సాగిస్తుంటారు. వారు కూడా భయంతో రాకపోకలు సాగిస్తున్నారు.


పరిశీలన

అయితే ఎట్టకేలకు హిమాచల్‌నగర్ గ్రామ పెద్దలతో పాటు నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, పూడి భాస్కర్‌రావు,మిత్తిరెడ్డి శంకరరావు తదితరులు శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను గుర్తించారు. సమస్యను జీవీఎంసీ డీఈ,ఏఈకి వివరించారు. త్వరలో రక్షణగోడ నిర్మిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

విశాఖ విద్య: అర్హులైన వారందరికీ దీపం పథకం-2 లో ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద మహిళలకు ఉచితంగా రెండో గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గణబాబు ప్రారంభించారు.ఒకవేళ గ్యాస్ రాయితీ డబ్బులు జమ కాకపోతే వినియోగదారులు 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జోన్- 8 జోనల్ కమిషనర్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

శ్మశానవాటిక ముందు దుకాణం

- కార్పొరేటర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కోరమాండల్ శ్మశానవాటిక ముందు వెలసిన దుకాణం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధి కోరమాండల్ ఎదురుగా గల హిందూ శ్మశాన వాటిక గేటు ముందు ఫుట్‌పాత్‌పై వార్డు టీడీపీ నాయకుడు అండతో ఓ వ్యక్తి దుకాణం ఏర్పాటు చేశాడు. పారిశ్రామిక ప్రాంతం పరిధిలో ఎవరు మృతి చెందినా ఇక్కడ శ్మశానవాటికకు తీసుకువస్తారు. అయితే ఫుట్‌పాత్‌పై స్థానిక టీడీపీ నాయకుడు అండతో వాణిజ్య దుకాణం ఏర్పాటు చేశారు. దీంతో మృతదేహంతో వచ్చే వారితో పాటు, పలువురు పాదచారులు,వాకర్స్ దుకాణం వల్ల ఇబ్బంది పడుతున్నారు. సమస్యను స్థానిక వాసులు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి ఆయన జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు స్పందన కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మేయర్ వెంటనే అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగించాలని జోన్-5 టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు దుకాణాన్ని తొలగిస్తున్న సమయంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కడకు వచ్చి దుకాణం తీయడానికి వీల్లేదని అడ్డుపడ్డాడు. అక్కడ నుంచే ఎమ్మెల్యే పి.గణబాబు పీఏతో అధికారులకు ఫోన్ చేయించడంతో అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు.

ఆక్రమణలను ప్రోత్సహిస్తారా..

దీనిపై కార్పొరేటర్ పి.వి.సురేష్ జీవీఎంసీ కార్పొరేటర్లు,అధికారులు ఉన్న వాట్సప్ గ్రూప్‌లోవార్డులో సమస్యపై అధికారులు స్పందించడం లేదని పోస్టు చేశారు. ఎమ్మెల్యే గణబాబుకు దనదాహం ఎక్కువ అయిందని,అందుకే శ్మశానం అని చూడకుండా ఇబ్బంది కలిగించే విధంగా దుకాణం ఏర్పాటు చేసినా స్పందించడం లేదని కార్పొరేటర్ సురేష్ ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక ప్రాంతంలో ఇలాంటి ఆక్రమణలు ఎక్కువ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కార్పొరేటర్ సురేష్ కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అక్కిరెడ్డిపాలెం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గాజువాక సెలస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సైబర్ నేరాల వల్ల పౌరులు ఎలా నష్టపోతున్నారు... నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు.దేశంలో దారిదోపిడీ, హౌస్ బ్రేకింగ్ వంటి నేరాల్లో రూ.80 కోట్లు తస్కరిస్తే... సైబర్ నేరాల్లో రూ.220 కోట్లకు పైగా నేరగాళ్లు తస్కరించారన్నారు. పెహల్గాం ఘనట తర్వాత పాకిస్తాన్ హ్యాకర్స్ ఇండియన్ వెబ్ సైట్లను హ్యాక్ చేశారన్నారు. గాజువాక సీఐకు నగర పోలీస్ కమిషనర్ డబ్బులు అడుగుతున్నట్టు మెసేజ్ వచ్చిందన్నారు. సీఐ ఫోన్ చేయడంతో అసలు విషయం బయట పడిందన్నారు. కస్టమర్ కేర్ ఫ్రాడ్, యూపీఐ లాటరీ, జాబ్ కేవైసీ ఫ్రాడ్‌లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్ ఫ్రాడ్ వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్లను విజిట్ చేస్తే సైబర్ నేరగాళ్లు కనిపెడుతూనే ఉంటారని.. అలాంటి వారిని డిజిటల్ అరెస్ట్ పేరిట బయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తారని వివరించారు. ఎవరు భయపడకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే 1930కు ఫోన్ చేస్తే వారి బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ- 2 మేరీ ప్రశాంతి, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి, క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవికుమార్, సెలస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జోన్ల పునర్వ్యవస్థీకరణపై సలహాల స్వీకరణ



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పరిపాలనా సౌలభ్యం కోసం జీవీఎంసీ జోన్ల పునర్వ్యవస్థీకరణకు శుక్రవారం సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతిపాదనలు చేసేందుకు జోన్-5 జోనల్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం దిశగా మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జోన్‌కు సంబంధించి ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలను స్వీకరించినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పలు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెందుర్తి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని, అతడ్ని రక్షించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెం వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం(60)కు భార్య, కుమార్తె, అల్లుడితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి వీరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో చింతలపాలెనికి సమీపంలోని జంగాలపాలెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ హుటాహుటిన అక్కడకు వెళ్లి, సత్యంను చాకచక్యంగా కిందికి దించేలా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

'సీఆర్ఏఎఫ్'కు పూర్తి అనుమతులివ్వాలి

మద్దిలపాలెం: రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం గతేడాది స్థాపించిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం(సీఆర్ఏఎఫ్) సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరచడంలో ప్రభుత్వ పూర్తి అనుమతులు జారీ చేయాలని ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనుమతులు జారీ చేసేలా దరఖాస్తు చేశామని శుక్రవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. రాష్ట్ర విద్య, స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వైద్య, ఆరోగ్య, హోం , దేవదాయ శాఖలతోపాటు మరిన్ని శాఖలకు దరఖాస్తు చేశామన్నారు. ప్రధానంగా బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ కళాశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనకు అనుమతివ్వాలని కోరారు. ఫోరం తరపున రూపొందించించే వివిధ బాలల చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించే పోస్టర్లు, స్టిక్కర్లు, సోషల్ మీడియాలో ప్రచారం చేయనున్నామని తెలిపారు.ప్రత్యేక అనుమతులు కోరుతూ రాష్ట్ర హోం శాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి ప్రభుత్వ అనుమతులు రాగానే తమ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం విస్తృత స్థాయిలో పిల్లల సేవలు అందించనున్నట్టు ధనలక్ష్మి, ప్రవీణలు పేర్కొన్నారు.